సకల విద్యలు నేర్చి సభ జయించగ వచ్చు
శూరుడై రణమందు పోరవచ్చు
రాజ రాజై పుట్టి రాజ్యమేలగ వచ్చు
హేమ గోదానము లీయవచ్చు
గగనమందున్న చుక్కల లెక్క గొనవచ్చు
జీవ రాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగ విద్యల నభ్యసింపగ వచ్చు
చంద్రమండలమైన చేరవచ్చు
కాని దేహేంద్రియములరి కట్టి ఎపుడు
మనసు నిల్పి యంతర్ముఖముగను చేసి
నిశ్చల సమాధి చిత్తుడై నిలువ లేడు.

విద్యార్థులారా!

శరీరమునకు యింద్రియములపైన ప్రభావము వున్నది. ఇంద్రియములకు శరీరముపైన మరింత ప్రభావము వున్నది. శరీరమును వదలి యింద్రియములు, యింద్రియములు వదలి శరీరము వుండుటకు వీలుకాదు. ఇవి రెండును అవినాభావ సంబంధము, అన్యోన్య ఆశ్రయము. Negative లేక positive, positive లేక negative వుండి యే విధముగా నిష్ప్రయోజనమో అదే విధముగా దేహము లేక యింద్రియములు, యింద్రియములు లేక దేహము వుండుట నిష్ప్రయోజనమే. కనుక శరీరమును సరియైన విధముగా పోషించుకోటము ప్రతివ్యక్తి కర్తవ్యము.

ఇక్కడ యింద్రియముల యొక్క తత్వము అత్యంత అద్భుతము. దైవత్వమనేది మహా చిత్రవిచిత్రమైనప్పటికి యింద్రియముల తత్వము, యింద్రియముల యొక్క అనుభూతి యింద్రియముల యొక్క చేష్టలు అంతకంటె అద్భుతముగా వుంటున్నాయి.

చిత్రంబులు త్రైలోక్యవి
చిత్రంబులు భవలతాల విత్రంబులు స

స్నిత్రంబులు బుధజనవన
పౌత్రంబులు యింద్రియముల చారిత్రంబుల్.

ఈ యింద్రియములు దేహముకంటె సూక్ష్మమైనవి. శరీరమునందు శబ్దస్పర్శరూప రస గంధాదులుండినప్పటికిని, వాతపిత్త శ్లేష్మాదులు వుండినప్పటికిని యింద్రియముల యొక్క తత్వము అన్నింటి యొక్క సమత్వముగా భావించుకొని తమ ప్రభావమును దేహముపైన చలాయిస్తూ వుంటుంది. ఇంద్రియములు విషయములను స్పర్శించినప్పుడే సుఖ దుఃఖములు, శీతోష్ణములు సంభవిస్తున్నాయి. విషయములు లేక యింద్రియములు క్షణమైనా నిలువవు. విషయ సంబంధమే యింద్రియముల యొక్క ప్రధాన కర్తవ్యము. ఇంద్రియములను కేవలము యేకముగా భావించి, దివ్యముగా వరించి, భవ్యముగా క్షీణింప చేయుటము విషయమనరు సాధ్యముకాదు.

ఇంద్రియములకు ఒక చక్కని పేరు గలదు. మాత్రాః అని దీనికొక పేరు. మిత్రతే యితి మాత్రః అని. అనగా ఒకవిధమైన కొలతలను నిర్ణయము గావించునదియె యీ యింద్రియముల ప్రభావము. ఈ కొలతలు యేవిధముగా గావించుచున్నవి యీ యింద్రియములు. ఈ ఫలము తీయగా వున్నది లేక పుల్లగా వున్నది అని నిర్ణయించే అధికారము దేనికి వున్నది. దీనిని కొలత వేసే యింద్రియములు యేమిటి? అదియె నాలుక. యీ నాలుక పదార్థముల మంచి చెడ్డలను కొలత వేసి ప్రమాణ పూర్వకముగా జగత్తునకు అందించు చున్నది. ఈ చిత్రము విచిత్రముగా వున్నది. వికారముగా వున్నదని చిత్రము యొక్క విచిత్రములను నిర్ణయించే కొలత దేనికి వున్నది. ఈ కొలత బద్ధ కన్నుమాత్రమే. ఇంక యిదే విధముగనే అన్ని యింద్రియములు కూడను. ఇది దుర్గంధము యిది సుగంధము అని నిర్ణయించే కొలత బద్ధ ముక్కు. ఇది సుస్వరము యిది దుస్వరము అని నిర్ణించే కొలత బద్ధ కర్ణము. కనుకనే యీ యింద్రియములకు నిర్ణయించే అధికారము వున్నది కనుకనే దీనికి మాత్రాః అని ఒకపేరు.

కఠోపనిషత్తు యందు శరీరమనే రథమునకు యింద్రియములు అశ్వముల వంటివని నిర్ణయించారు. ఈ యింద్రియములకు అశ్వములు అని పేరు పెట్టుటకు కారణము ఏమిటి? అశ్వమనగా నిరంతరము చలించే స్వభావము గలదే అశ్వము. అందరకు తెలిసిన విషయమే. గుఱ్ఱము నిద్రించుచుండిన, మేల్కొనుచుండిన, నిల్చుని వుండిన తన దేహమునందు యేదో ఒక అంగము కదలిస్తూనే వుంటుంది. తోక తప్పితే కాలో, కాలు తప్పితే చెవ్వో ముక్కో ముక్కు తప్పితే నోరో యేదో ఒకటి కదలిస్తూ వుంటుంది. చలన స్వభావము గలది కనుకనే దీనికి అశ్వమని పేరు వచ్చింది. అదే విధముగానే మనము రావి వృక్షము చూస్తున్నాము. ఐతే అది

గాలి లేకపోయినా దాని ఆకులు ఎప్పుడూ ఆడుతూనే వుంటుంటాయి. కనుకనే దానికి అశ్వత్థవృక్షమని పేరు పెట్టారు. ప్రాచీన రాజులందరు అశ్వమేధ యాగమని ఒక ప్రత్యేక యాగము సలిపేవారు. అశ్వమేధ యీరెండు పదముల అంతరార్థము గుర్తించుకొన్నప్పుడు అశ్వమేధమనేది యేమిటో మనకు సుస్పష్టముగా అర్థమవుతుంది. మేధ అనగా బుద్ధి. అశ్వమనగా చలించేది. అశ్వమేధమనగా చలించే బుద్ధి. ఈ చలించే బుద్ధికి ప్రతిబింబమే అశ్వము. ఈ అశ్వమేధ యాగమునందు యీ అశ్వమును యెవరు పట్టగలరో వారే ధీమంతులని పేరు. ఎవరు దీనిని పట్టే వారు? ఎవరు దీనిని అణగద్రొక్కేవారు? ఎవరు దీనిని కొంతవరకు నిగ్రహించేవారు వారే నిజమైన ధీరులు అన్నారు. కనుక మన యింద్రియములను అరికట్టి యింద్రియములను స్వాధీనము చేసుకున్న వ్యక్తియే ధీమంతుడు. అనే విషయము లోపల బాహ్యార్థముగా యీ భౌతికమైన జగత్తునందు యీ అశ్వమును యెవరు పట్టగలరో వాడే ధీమంతుడు అని అతనితోనే యుద్ధము చేసే అధికారము వున్నది అనేది ప్రాచీన రాజులు ప్రభావమును నిరూపిస్తూ వచ్చారు. ఇక్కడ అంతరార్థ బాహ్యార్థముల యొక్క సమన్వయమే నిజమైన యదార్థము. కనుక యీనాడు ప్రతి మానవుడు కూడను యీ అశ్వమును పట్టి కట్టాలి. అప్పుడే ధీరులౌతారు. ఎన్ని యాగములు, ఎన్ని యజ్ఞములు, ఎన్ని క్రతువులు, ఎన్ని గ్రంథములు పారాయణము సల్పినప్పటికిని దీని నిగ్రహించలేని వ్యక్తులు యివన్నిటిని వ్యర్థము గావించినవాడే.

ఈ మాత్రకు అనే దానికి మరొక అర్థము కూడను వుంటున్నది. అనగా పరిమితమును నిర్ణయించేవి యింద్రియములు. ఒక్కొక్క యింద్రియమునకు ఒక్కొక్క పరిమితిని మాత్రమే నియమించినాడు భగవంతుడు. కన్ను చూడగలదే కాని వినలేదు. నోరు మాటాడగలదే గాని చూడలేదు. ఇట్లా ఒక్కొక్క యింద్రియమునకు ఒక్కొక్క విధమైన నిర్ణీతమైన నిబంధనలు సలిపాడు. దీనికి నియమించిన నియమములను ఎవరు సక్రమముగా నడుచుకొందురో వారే భగవదాజ్ఞను పరిపాలించిన వారౌతారు. ఎవరు యీ నియమములను వుల్లఘింతురో వారు దీని యొక్క శిక్షకు గురౌతారు. ఒక్కొక యింద్రియమును దాని నిర్ణయానుసారముగా వుపయోగించుకొని దానిని రక్షించుకోటానికి ప్రయత్నించాలి. ముక్కుకు ఒక నిర్ణయాన్ని యిచ్చాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసములు తీసుకొని ఆరోగ్యమును కాపాడుకోటం. సుగంధ దుర్గంధములను నిర్ణయించి కేవలము సుగంధమును మాత్రమే స్వీకరించటము యీ రకమైన నిర్ణీతమైన కర్మలు ఆచరించటమే యీ నాసిక యొక్క పని. కానీ దురదృష్ట వశాత్తు యీ నిర్ణయమును వుల్లంఘించి దీనితో పాటు యీ ముక్కుతో నస్యము పీల్చటము, దుర్గంధమును పీల్చుకోటము యీ రకమైన

విరుద్ధమైన కర్మలు ఆచరింప చేయుటవలన ఆచరించు చేత యీ విధించిన నిబంధనలను తాను వుల్లం ఘించిన వాడౌతాడు. భగవదాజ్ఞను వుల్లంఘించిన దోషము ఒకటి ఆరోగ్యమును పెడమార్గము ను పట్టించటము మరొకటి యీరెండు దోషములకు గురికావటం చేతనే మానవుడు అనారో గ్యము చేత పీడింపబడుతున్నాడు. అదేవిధముగనే నాలుక. ఇది కేవలము ఆహారమును స్వీక రించి ఆరోగ్యమును పోషించి ఆనందమైన వార్తల చేత వుల్లాస పరచి మృదుమధురమైన సం భాషణ చేత సంతోష పరచి, తనలో వుండిన స్వభావములను రహస్యములను వెలువరచుటానికి తగిన అవకాశము నందించి గాఢమైన భావములను యితరులకు వుచ్చరింప చేసే నిమిత్త మే అందించినది యీ జిహ్వ. ఈ రకమైన సన్మార్గమును అనుభవించి సత్కీర్తిని పొందే నిమిత్తమై అందించిన యీ జిహ్వను యీనాడు మనము దుర్వినియోగ పరచుకుంటున్నాము. మత్తు పదా ర్థములు స్వీకరించుటవల్ల, మాంసమును భక్షించటము, సిగరెట్లు బీడీలు చుట్టలు కాల్చటము పరదూషణ చేయటము పరనిందలు చేయుటము కఠినమైన మాటల చేత యితరులను బాధించటము యీరకమైన విరుద్ధమైన చర్యల చేత భగవదాజ్ఞను వుల్లంఘించటము నిర్ణయమును ధిక్కరించటము యీ కారణముల చేత అనేక రకములైన బాధలు మానవు డు అనుభవించ వలసి వస్తుంది. ఇదే విధముగనే ప్రతి అంగము కూడను తమ నిర్ణయాను సారముగా సక్రమముగా అనుభవించటం చేతనే మానవుడు అత్యున్నత స్థాయిని అందుకోగల డు.

ఇంద్రియములున్నవి కదా యని యిష్టాను సారము వుపయోగించ కూడదు. ఇవి అశ్వములు. ఈ అశ్వములతో యేవిధమైన రథము నడపటానికి తగిన వుపాయములు, తగిన సాధనలు మనము అనుభవించాలో దానికి తగిన రీతిగా మనము ఆచరించాలి. బండి వెను క గుర్రము ముందు వుంటుండాలి. కానీ యీనాడు అశ్వము వెనుక బండి ముందు పెడుతు న్నారు. దీనివల్ల యనేక విధములైన ప్రమాదములు సంభవిస్తున్నాయి. అట్లుకాక యింద్రి యములను గౌరవించాలని, యింద్రియములను ప్రేమించాలని యింద్రియములను అనేక రకములైన సత్కార్యములు సల్పాలని ఆశించి బండి లోపల యింద్రియ గుర్రములను కూర్చోబెడితే బండి యే రీతిగా కదుల గలదు. మనలో యింద్రియములనూ క్రమక్రమము గా బలపరచుకుంటూ అంతర్ముఖముగా దానిని అణగద్రొక్కటానికి ప్రయత్నం చేయటం లేదు. గుర్రములకు తగిన పని యివ్వక వాటికి అమితముగా మేత పెట్టి బలపరచటం చేత అది కూడను కొంత ప్రమాదము కలుగుతుంది. ఈనాడు గుర్రములకు తగిన [illegible]

పని పెట్టటం లేదు. ఈ గుఱ్ఱములకు యిష్టానుసారముగా దాణా పెట్టి దానిని బలిపెట్టి దానిని మదుమెక్కేరీతిగా మనము పెంచుతున్నాము. కనుకనే యీ గుఱ్ఱములు మదమెక్కి పెడమార్గము పట్టి యజమానినే ప్రమాదములో వుంచుచున్నాది. కనుక మన యింద్రియములను భగవంతుడిచ్చిన నిర్ణయానుసారముగా అనుభవించాలి. ఈ విధముగా సరియైన మార్గములో వినియోగించకుండా వుంటే యిది అనేక రకములైన అశాంతికి గురౌతున్నాది.

అనేక మందికి తెలుసు. ఒకరికి ఒక భార్య వుంటేనే ఆ సంసారము చికాకుగా వుంటుంది. ఇద్దరు భార్యలు వుంటుంటే యింక చెప్పనక్కర లేదు. ఉత్తానపాదునకు యిద్దరు భార్యలు. కనుకనే యిక్కడ యనేక రకములైన భిన్నాభిప్రాయములు ఆవిర్భవించి కన్నకొడుకు ధ్రువుని కారడవులకు పంపవలసి వచ్చింది. దశరథునకు ముగ్గురు భార్యలు. యితను కూడను యీ భిన్నాభిప్రాయముల చేత వారిని సరియైన స్థితిలో వుంచుటానికి సాధ్యము కాకపోవటం చేత భార్యను సంతోష పెట్టాలని వుద్దేశ్యము చేత కన్న కుమారుడైన శ్రీరాముని అడవికి పంపి కాయమును కోల్పోయాడు. ఒకరిద్దరు భార్యలకే యిన్నివిధమంతైన ప్రమాదములు సంభవిస్తుంటే పదిమంది భార్యలున్నవారు ఎంతప్రమాదమునకు గురౌతారు యోచన చేయండి. ఈ మనస్సనే మహాపురుషునకు పదిమంది భార్యలు అవే దశేంద్రియములు. ఒక్కొక్క యింద్రియము ఒక్కొక్క దానిని ఆశిస్తూ వుంటుంది. ఒక యింద్రియము మసాలా వాసన వస్తున్నాది మసాలా దోశ కావాలంటుంది ముక్కు. నేను సుస్వరాన్ని వినాలి రేడియో పెట్టమని చెవులు అంటున్నాయి. ఏదో కొత్తగా వచ్చిందట సినిమా దానిని చూడాలని కన్నులు ఆశిస్తాయి. ఈ విధముగా ఒక్కొక్క యింద్రియము ఒక్కొక్కదానిని కోరుతూ పోతున్నాయి. అన్నీ ఒకే పర్యాయము ఒక్కొక్క యింద్రియము ఆశించినప్పుడు యీ యజమానుడు ఆ ఆశను యేరీతిగా తీర్చగలడు. ఈ విధముగా ఆ యింద్రియముల యొక్క ఆశ తీర్చలేక మనస్సు యనేక రకములైన రీతిగా కూలిపోతున్నాది. ఇంతమంది పత్నులు కలిగిన యీ మనస్సనే యజమానికి శాంతి ఎక్కడ నుండి వస్తుంది. శాంతి అత్యంత దూరముగా వుంటుంది. కారణము యీ యింద్రియముల వాంఛలను తీర్చటము చాలా కష్టము. కనుక యీ యింద్రియముల యొక్క తత్వాన్ని మనము సరైన రీతిలో అదుపులో పెట్టినప్పుడే తాను తన పరిసరముల వారు కూడను ఆనందమును అనుభవించగలరు.

ఐతే యింద్రియములను సమన్వయ పరచే మార్గము కూడను ఒకటి వున్నది.

మంచి చెడ్డలు రెండును సమత్వముగా భావించి ఆనందముగా కాలముగడిపే వ్యక్తులు కూడను
అనేక మంది వుంటున్నారు. ఇది యేవిధముగా అంటే తుకారాం వుండే వాడు. అతను పరమ
భక్తుడు. కానీ అతను గృహస్తు. అతని భార్య మహాగయ్యాళి. అయినప్పటికిని ఆమె మనస్సును
సరియైన రీతిలో సమన్వయపరచుకొని తాను ప్రవర్తించటానికి తాను కృషి చేసే వాడు. మాటు
కు మాటకు, వేటుకు వేటు జరిగినప్పుడే అది ఒక పెద్ద ప్రమాదముగా ఏర్పడుతుంది. అన్నిం
టిని కూడను సమర్థించుకొని ప్రశాంతముగా కాలము గడిపేవాడు యీ తుకారాం. ఏవిధముగా
అంటే అతనికి ఒక అర్థ ఎకరా భూమి వుంది. ఏదో కుటుంబ పోషణ నిమిత్తమై దానిని సాగు
చేస్తూ వుండే వాడు. యిరుగు పొరుగు వారి ప్రోద్భలము చేత తన అర్థ ఎకరా పొలములో చెఱు
కు పండించటానికి ప్రయత్నించాడు. ఏదో రీతిగా పండించాడు పాపం. తుకారాం బలహీనత
అందరు గుర్తించిన వారు కనుక అది పూర్తి పరిపక్వ స్థితికి వచ్చేటప్పటికి అటుపోయే వాడు ఒక
చెఱుకుని కొట్టుకు తినటం, యిటు పోయేవాడు ఒక చెఱుకును కొట్టుకు తినటం బాటసారు
లకు ఆ చెఱుకు ఆహారమైంది. కడపటికి యేదో వున్న దానిని యింటికి తీసుకురావాలని ఒక
బండి కట్టుకొని ఆ చెఱుకు తోటకు వెళ్ళాడు. మోపు కట్టుకున్నాడు చెఱుకును. ఇంటికి వస్తున్నా
డు బండిలో దారిలో అడ్డము వచ్చిన పిల్లలందరు కూడను తాను నాకొక చెఱుకు అని అందరు
అడుగుతూ వచ్చారు. త్యాగము తుకారాంకు స్వభావము. అటువంటి త్యాగభావము కలిగి వుం
డటం చేత అడిగిన వారికి అందరికి యిచ్చాడు. ఇంటికి చేరేటప్పటికి ఒక్క చెఱుకు మాత్ర
మే మిగిలింది. బండి వచ్చింది. చూచింది భార్య. ఏమిటిది ఒక్క చెఱుకును తీసుకువ
చ్చావా సంసారము యే రీతిగా పోషించాలని యోచిస్తున్నావు ? ఆలుబిడ్డలను పోషించలేని
యోగ్యత లేనప్పుడు నీవు ఎందుకు పెండ్లాడాలి. ఈ విధముగా సర్వము పరులకు త్యాగము చేస్తుం
టే స్వవిషయము ఏమై పోతుంది ?" అని కోపములో నానా మాటలు మాట్లాడి ఆ బండిలో
వుండిన చెఱుకును తీసుకొని కొట్టింది భర్తను. ఆ చెఱుకు రెండు ముక్కలై క్రిందపడి ఒక
ముక్క భార్య చేతిలో నిల్చింది. తుకారాం చాలా ఆనందించాడు. 'బండిలోనుంచి నేను వచ్చేం
తవరకు కూడను చాలా సమస్యలతో వచ్చాను. ఇప్పుడు నా సమస్య తీరిపోయింది. ఏమిటి
నా సమస్య అంటే ఒక చెఱుకుని తీసుకొని పోతున్నాను. యిద్దరు బిడ్డలున్నారు. ఒక భార్యవుంది.
దీనిని యే రీతిగా పంచాలి అని యోచిస్తూ వచ్చాను. నా యొక్క సమస్యానికే పరిహారము చే
శావన్నాడు. ఏమంటే క్రింద పడిపోయిన రెండు ఒకటి ఒక బిడ్డకు రెండవది రెండవ బిడ్డకు
చేతిలో వున్నది భార్యకు సరిపోయింది. నా సమస్య తీరి పోయింది' అన్నాడు. ఈ విధముగా యింద్ర

యములప్రభావము తనపైన ఎంత బలవంతపరచినప్పటికి సమన్వయము గావించుకొనే చిత్తము కొంతమంది మహనీయులకు మాత్రమే వుంటుంది. ఇది కేవలము భక్తి శ్రద్ధలతో మాత్రమే లభ్యమవుతుంది. కనుక యింద్రియములు నిగ్రహించుకోటం ఎవరి చేత కాదని నిరుత్సాహ పడనక్కరలేదు. పవిత్రమైన భక్తిప్రపత్తుల చేత యింద్రియములను స్వాధీన పరుచుకోవచ్చును. తుకారాం ఆవిధముగా చేసినప్పుడు కబీరు యింకొక రకముగా చేస్తూ వచ్చాడు. అతని భార్య అతని అడుగుజాడలలో నడిచేది పాపం. మహాసాధ్వీమణి. భర్త అభీష్టమే తన అభీష్టము. తనకు ప్రత్యేకమైన వాంఛలేదు. ఏ ఆజ్ఞను నియమించినా దానిని శిరసావహించి ఆచరించేది. ఒకనాడు కబీరు నేస్తూ వుండగా రామ రామ అని రామనామస్మరణ చేస్తూ పట్టపగలు పన్నెండు గంటలు. ఏమే లోపల వున్నావా అని పిల్చాడు. పరుగెత్తి వచ్చింది. ఇక్కడ నూలుపోగు తెగింది దీపం అంటించుకొని రా అన్నాడు. వెళ్లింది. దీపం అంటించుకు వచ్చింది. దగ్గరకు వచ్చిన తరువాత అక్కరలేదు తీసుకుపో అన్నాడు. తీసుకు వెళ్లిపోయింది. ఏ ఒక్క జవాబు తాను చెప్పలేదు. ఏమిటి పట్టపగలే కండ్లు కనుపించలేదా? దారము తెగింది అని చెప్పి దీపము తెచ్చిన తరువాత తిరిగి దీపం తీసుకు పొమ్మని చెప్పటమా ఏమీ పనిలేదా మాకు అని భార్య భర్తతో యేమాత్రము వాదించలేదు. కనుక యీ విధమైన భర్తకు సహకారముగా వుండే భార్యవల్ల తాను భగవద్భక్తిని పెంచుకుంటూ భగవంతునికి thanks చెప్పాడు పాపం. ఒకవైపున తుకారాం విరుద్ధమైన భార్యతో పవిత్రమైన మార్గమును అందుకున్నాడు. కబీరు అనుకూలవతియైన భార్యతో పవిత్రమైన స్థితిని పొందాడు. కనుక మన వాతావరణము యేమాత్రము అడ్డురాదు. మనలో వుండిన భావము పరిశుద్ధముగా వుండాలి. కనుక బయటి వాతావరణమును యేమాత్రము పాటించరాదు. నీయొక్క భావ చిత్తము నీయొక్క పవిత్రమైన భావము పరిశుద్ధమైన సమన్వయ భావము గావించుకోవాలి. మీకు తెలిసినవాడే Einstein. ఇతను మహా విజ్ఞాని. కానీ అతనికి మూర్ఖురాలైన భార్యవుంది. ఆమె విద్యావంతురాలు కాదు. కాకుండా పోయినంత మాత్రమున యేమీ బాధ లేదుగాని మొరటు మనిషి. ఈ Einstein నిరంతరము యేదో ఒక యోచనలో మునిగి వుండేవాడు. విచారణ experimental రూంల్లోనే తన కాలమును గడిపేవాడు సకాలమునకు భోజనమునకు వెళ్లేవాడు కాదు. టీ, కాఫీకి కూడను భార్య అనేక పర్యాయములు వచ్చి పిలచిన తరువాతనే లోపలకు వెళ్లేవాడు. ఈ విధముగా చేస్తున్నంత వరకు కూడను భార్యకు విసుగెత్తింది. సకాలమునకు యింటికి రాడు. సకాలమునకు భోజనము చేయడు సకాలమునకు టీ త్రాగడు. అతని కోసము నేను కాచుకోవాలి యేమిటి యీ అవస్థ అని అనేక

రకములుగా తాను నిరంతరము బుర్‌బర్ అని కోపం చేస్తూ వుండేది. ఒకనాడు పాపం ఆమెకు చాలా ఆకలి వేసింది. ప్లేటు లోపల వంట వడ్డించింది. టేబులు దగ్గర కూర్చుంది. రండి రండి అని పిలిచింది. పాపం అనేక పర్యాయములు. కాని అతను వినిపించుకోలేదు. ఆ టేబుల్ పైన బియ్యం లుట్టు వుంటున్నాది. కోపంతో పరుగెత్తింది. ఆ బియ్యం లుట్టుతో అతని తలపైన నీరు పోసింది. అప్పుడు యీ Einstein నవ్వుతూ 'ఆహా! నిత్యము వురుములు, మెరుపులు మాత్రమే వుండేటువంటివి. ఈ నాడు కుంభవర్షము కురిసింది నా తలపైన' అన్నాడు. ఎంత సమన్వయము గావించుకున్నాడో చూడండి. భార్య జగ్గుతో తలపైన నీరు పోస్తే జగ్గును తీసుకొని కొట్టే వారు యీ కాలము పురుషులు. కానీ తాను దానికి పూనుకోలేదు. అదే యింద్రియ నిగ్రహము. ఇది ఒక తపస్సుగా భావించుకుంటూ వచ్చారు మన పూర్వీకులు.

భామస్ అని ఒక క్రిస్టియన్ మతప్రబోధకుడు వుంటుండేవాడు. అతను ప్రతి పల్లెకు వెళ్ళి ఆ మతమును ప్రబోధము సలుపుతూ వుండేవాడు. ఒకనాడు గుఱ్ఱపు బండి ఎక్కి ఒక పల్లెకు వెడుతున్నాడు. మధ్యమార్గములో ఒక Level cross అడ్డము వచ్చింది. ఆ గుఱ్ఱము చక్కగా పరుగెత్తుతున్నాది. కానీ ఆ Level cross దగ్గరకు వచ్చేటప్పటికి యీ గుఱ్ఱపు యజమాని దానిని అధికముగా కొడుతూ వచ్చాడు. మతప్రబోధకుడు కనుక జీసస్ యొక్క ప్రభావము కరుణయే అతని యొక్క ప్రధాన ప్రచారమని విశ్వసించిన వాడు కనుక 'అయ్యా! చక్కగా నడుస్తున్న గుఱ్ఱమును ఎందుకింత బాధపెడుతున్నావు?" అప్పుడు జట్కావాడు చెబుతున్నాడు, 'సార్! యీ Level cross ప్రక్కలోపల తెల్లగా కొన్ని రాళ్ళు పాతిపెట్టారు. ఈ తెల్ల రాళ్ళు చూచేటప్పటికి యిది భయపడుతున్నాది. ఆ భయము కంటె ఎక్కువ భయము నా యొక్క కొరడా దెబ్బలు. కనుక ఆ భయము వదలి యీ భయములో తాను ప్రవేశిస్తుంది. ఆ భయము తప్పించే నిమిత్తమై యీ భయము నేను ప్రాక్టీసు చేస్తున్నాను' అన్నాడు. అప్పుడు భామస్ యోచన చేశాడు. ఆహా! మనస్సును యే విధముగా మరల్చాలి అనేది ఒక జట్కావాని వల్ల తెలుసుకున్నానన్నాడు. ఒక యింద్రియము ఒక విషయముపైన పరుగెత్తుతున్నప్పుడు ఆ విషయమునుండి తప్పించి యింకొక విషయముపై మరలించటానికి తగిన శిక్షణ యివ్వాలి. ఇది అనేక పిచ్చి మార్గములలో ప్రవేశిస్తున్నాది. దానికి విరుద్ధమైన దానికంటె యింకా అధికమైన దానిని నిరూపింప చేసినప్పుడు దాని మార్గము వదలి సరియైన మార్గములో ప్రవేశిస్తుంది. దొంగపశువు వుందనుకోండి. అది యేదో పంటలో పడి మేయటానికి పోతుంది. అంతకంటె మంచి పచ్చగడ్డిని మనము యింటిలో వేస్తే ఆ పంటకే పోదు అది. ఇంటి దగ్గరనే వుండి మేస్తుంది. తాను ఆశం

చిన దానికంటె ఉత్తమమైన దానిని మనము ప్రవేశపెట్టినప్పుడు ఆ ఆశను నిరాశగా చేసుకొని ఉత్తమమైన మార్గములో ప్రవేశిస్తుంది.

ఇంద్రియములను పశువులని కూడను చెప్పారు. ఎందుకోసమని పశువని చెప్పారు. పశ్యతి ఇతి పశుః అని అంతరార్థము. బయట దృష్టి కలిగినది పశువు. లోదృష్టి కలిగినది పశుపతి అని. మానవుడు పశుపతి కావాలిగాని పశువు కాకూడదు. నీవు గాయిగాలు కావాలి గాని సిలుయిల కాకూడదు. నీవు ఇంద్రియాలకు బానిసై పోయినప్పుడు నీవు సిలుయిల అయిపోతావు. ఇంద్రియాలకు నీవు గాయిగాలు కావాలి. మాష్టరే మానవుడు. కనుక ఇట్టి మాష్టరైన మానవుడు కేవలము ఇంద్రియములకు వశమై పోయి బానిసగా జీవిస్తూ వున్నాడు. ఈ ఇంద్రియములు సక్రమమైన మార్గములో పెట్టుకోటానికి అనేక రకములైన మార్గములు ఉంటున్నాయి. దీనికి ఇష్టము వచ్చినవి అందించటానికి ప్రయత్నించకూడదు. ఈ ఇంద్రియముల యొక్క భోగము ఎక్కడ నుండి పుట్టిందని చక్కని విచారణ చెయ్యాలి. ఇవి దుఃఖము నుంచే పుట్టాయి. దీనికి పుట్టుక స్థానము ఎట్టిదో దీని ప్రభావము కూడను అట్టివిగానే వుంటాయి. కనుకనే ఇవి అందించేవి అంతా తాత్కాలికముగా భోగములు, భాగ్యములు, ఆనందములు అనుకుంటాము గాని ఇది పూర్తి దుఃఖాన్ని ఇస్తుంది. ఈ వాంఛలు క్షణములో పుడతాయి. క్షణములో అణగుతాయి. ఆద్యంతములు రెండు కూడను క్షణములోనే ఆవరిస్తాయి. ఈనాడు నేను లడ్డు తినాలని ఆశ పుట్టింది. ఆ పుట్టిన తక్షణమే రెండు లడ్లు తిన్నావు. రెండు లడ్లు తినేటప్పటికి విసుగు పుట్టింది. ఆశ ఎంతసేపు నిరాశ ఎంతసేపు. ఇష్టమెంతసేపు అయిష్టమెంతసేపు. ఒకొక్క క్షణములోనే ఇష్టాయిష్టములు రెండు జరిగిపోయాయి. క్షణభంగురమైనవి కదా. కనుక దీనిని సరియైన రీతిలో విచారణ సలిపి ఇంద్రియములకు తగిన పనిని మనము పెట్టాలి. ఈ ఇంద్రియములకు మనము పని ఇవ్వకుండా పోవటం చేతనే మనము అనేక రకములుగా బానిసలు కావలసి వస్తుంది. దేహము యొక్క వాంఛలు మనము సత్యమైనవిగా భావించరాదు.

నేను ఇక్కడ లేకుండా పోయినప్పటికిని ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా వారి వారి భావాలను వ్యక్తపరించే వన్నీ కూడను గుర్తిస్తూ వుంటుంటాను. సాయంకాలము అనంతపురం Principal హేమలత ప్రహ్లాదుని చరిత్రను చక్కగా సరియైన తెలుగు పదముల చేత పద్యముల చేత గానము చేత అందరిని శ్రవణానంద పరచింది. ఐతే అందులో ఒకటి ప్రధానమైన రీతిలో బోధిస్తూ వచ్చింది శిశుపాల దంతవక్త్రాదులు పరమాత్ముడైన కృష్ణుని నిరంతరము దూషిస్తూ వినరాని మాటల చేత నొప్పించువారు. ఐతే ఒకనాక సమయము లోపల

సభ జరుగుతున్నాది. అగ్రతాంబూలము ఎవరికి యివ్వాలని చేతియందుంచుకున్నాడు. ఎంత మందో మహర్షులు వుంటున్నారు సభలో ఆచార్యశ్రేష్టులైన ద్రోణాచార్యులు, కృపాచార్యులు భీష్మాచార్యులు అందరూ వుంటున్నారు. ఇతే అందరికంటె ఉత్తముడు భీష్ముడు. అతనికి యివ్వవచ్చుకదా అగ్రతాంబూలము. కాదు. కాదు. తమ ప్రియతమమైన ఆ మహా కృష్ణునికి మాత్రమే అందించాలని ఆశ. జీవితాధారము కృష్ణుడే. మాపరమావధి కృష్ణుడే. మా ప్రాణము కృష్ణుడే. అతను తప్ప అన్యులు యీ జగత్తులో కనుపించరు అని కృష్ణుని పిలచి పాదములు కడిగి అగ్రతాంబూలము యిచ్చాడు. దుర్మార్గులు, దుష్టులు అంత జ్ఞానములు యోచించరు. బాహ్య దృష్టి, బాహ్య భావములనే వారు అనుసరిస్తూ వుంటారు. వ్యక్తిగతమైన ద్వేషములను అసూయలను వారు ప్రకటిస్తూ వుంటారు. సమిష్టి భావము వారిలో శూన్యము. నాకు యిష్టము లేనంత మాత్రమున యితరులకు యిష్టము వుండదా అనే విశాల భావము వుండదు. ఇలాంటి సంకుచితమైన చిత్తములు వుంటుంటాయి. ఇంత పెద్ద సభలోపల తేచాడు శిశుపాలుడు. ఏదో అక్కడో ఎక్కడో మొరగటం కాకుండా ప్రత్యక్షముగా పాండవులంతా వుంటున్నారు. మహా సభ జరుగుతూ వున్నాది. ఇంత మంది ఋషుల లోపల కృష్ణుని యిష్టము వచ్చినట్లు దూషించాడు. ఎందుకు తాంబూలము యివ్వటము కృష్ణునకు?

స్నానంబు చేయు ఆ జవరాండ్ర చీరలు
కాజేసి నందుకా పూజ నీకు
గొల్ల పూబోండ్లతో జల్లులాడిన నారు
వర్షించి నందుకా అర్ఘ్యమిడుట
బాలునిక కట్టి పెట్టు పంచాంగ మింక
పొగడు కొన బోకు చాలించు మాయి నోరు.

shut up అన్నాడు. దీనితో ధర్మజుని యొక్క మనస్సు చాలా బాధపడి పోయింది. నా ప్రేమమూర్తి నా ప్రాణ సమానమైన భగవంతుని సభలోపల యిన్ని విధములైన పరాభవములుగా మాటలాడటమా అని తనలో తాను చాలా బాధపడిపోతున్నాడు. దీనికి తగినట్టుగా అగ్రతాంబూలమిచ్చిన ఆ తట్ట చేతనే శిశుపాలుని పైన విసిరాడు కృష్ణుడు. ఏదో సుదర్శన చక్రమంటారు. చక్రము కాదు. తాంబూలమిచ్చిన తట్టనే. ఆ తట్టనే చక్రముగా వెళ్లి శిశుపాలుని కంఠము ఖండించింది. కంఠము ఖండించినంత మాత్రమున ఆనందమేగాని ధర్మజునకు తక్షణమే ఆ కంఠమునుండి రక్తము అంతా ఎగిరి ఆ కృష్ణుని పాదముల పైన పడటము శిశుపాలుని ప్రాణస్వరూప

మైన జ్యోతి కృష్ణునిలో కలసి పోయింది. ధర్మజుని మనసు అయోమయమై పోయింది. అల్లకల్లోలమై పోయింది. ఆంధ్రాలో వచ్చిన తుఫాను వలె అయిపోయింది. ఈ దుర్మార్గుని కంఠము ఖండించటము సరియైనదే కాని అతని పాప జ్యోతి యీ పరమాత్మునిలో లీనము కావటము ఏమిటిది ఆశ్చర్యము. పరమ పాపి. ఇతను మహా దురాత్ముడు. దైవద్రోహి. ఇలాంటివాని జీవన జ్యోతి పరమాత్మునిలో చేరటమంటే ఏమిటిది ఆశ్చర్యము. ఇలాంటి వానికా పరమాత్ముడు అవకాశము యిచ్చేది. ఇలాంటి వారినేనా తాను స్వీకరించేది అని అనేకరకములుగా తాను యోచన చేస్తూ వచ్చాడు. ఈ సమస్యను నారదుని దగ్గర ప్రశ్నించాడు. ఎంతమంది భక్తులుంటున్నారు. ఎంతమందో శరణాగతి పొందినవారున్నారు. వీరెవరికి లేకుండా భగవంతుని దూషించిన వారికేనా యిటువంటి పవిత్రమైన స్థానము నందించటము. నారదుడు చెప్పాడు. అయ్యా దూషణా, భూషణా, తిరస్కార పురస్కారములన్నీ దేహమునకు గానీ ఆత్మకు కాదు. అందరియందు వుండినది ఒక్క పరమాత్ముడే. దూషించే వారెవరు? అందుకొనే వారెవరు? ఎవరు ద్వేషి ఎవరు ప్రీతి? అందరూ సమానులే. ఏ రక్తము నిరంతరము భగవంతుని చింత చేస్తుందో ఆ రక్తము భగవంతునికి అర్పితమై పోతుంది. ద్వేషము చేతనో, ప్రేమ చేతనో, కామము చేతనో, అసూయ చేతనో లేక అహంకారము చేతనో లేక ఏరీతిగానైనా సరే ఆ భగవంతుని నామము స్మరిస్తే చాలు భక్తులు స్మరించే స్మరణ కంటే శిశుపాలుడు అధికముగా స్మరించాడు. భక్తులు యేదో పూజ రూమకు పోయినప్పుడే పరమాత్మ అని రెండు దండాలు పెడతాడు. పటాలు చూచినప్పుడు రెండు దండాలు పెడతాడు. గుళ్ళ గోపురాలకు పోయినప్పుడు రెండు దండాలు పెడతాడు. కానీ శిశుపాలుడు అట్లు కాదు. సర్వకాల సర్వావస్థల యందు కృష్ణా కృష్ణా అని కృష్ణునే దూషించటము. నిద్రలో కూడను కృష్ణా కృష్ణా ఆ చింతన యొక్క ప్రభావమే యీ యొక్క అర్పణకు సరైన ఆధారమన్నాడు.

ఐతే లోకులు బాహ్యసంబంధమైన, లౌకిక సంబంధమైన విషయములను, చర్యలను మాత్రమే గుర్తిస్తూ వుంటారు. భగవంతుడు దానిని చూడడు. భగవంతునికి ద్వేషముగాని, అసూయగాని లేక యిష్టముగాని యే ఒక్కటి అతనికి లేదు. ఇవి అన్నీ మీలో నుండి ప్రతిబింబించే ప్రతిబింబాలే. భగవంతుడు నిర్మలమైన అద్దము వంటివాడు. ఆ అద్దము ముందు నిల్చుకొని నీవు యే విధముగా act చేస్తే ఆ అద్దములోని ప్రతిబింబము ఆ విధముగా act చేస్తుంది. అద్దము ముందు నిల్చుకొని దానిని దండిస్తూ యిట్లారా అదికూడా నిన్ను దండిస్తూ వస్తుంది. ఆ అద్దములో నున్న ప్రతిబింబమునకు నమస్కారము పెట్టి అది

అందిస్తుంది. అది నీవు చేసిన దానికి reactionగా వస్తుంది గాని భగవంతునికి actionగా reactionగా రెండూ లేవు. అట్టి భగవంతునికి ఒకటి యిష్టము యింకొకటి అయిష్టము అనేటువంటిది లేదు. శిక్ష, రక్ష అనేది లేదు. ఈ శిక్ష రక్షలన్నియు మన ప్రవర్తనల యొక్క ప్రభావములే. కనుక భగవంతునికి యీ విధముగా చేస్తున్నాడే, యీ విధముగా చూస్తున్నాడే, యీ విధముగా వారిని మాత్రము దగ్గరకు చేర్చాడే వీరిని మాత్రము దగ్గరకు చేర్చలేదే యీ విధమైన నిర్ణయము చేసే అధికారము ఎవ్వరికి లేదు. దేవుడంటే యెట్లో వుండాలి అట్లా వుండాలి అని ఎవరు శాసించటానికి అధికారము వుంది. అందరిలో వున్న దైవత్వము అన్నిరకములగను ప్రవర్తించవచ్చు. ఐతే స్వార్థ రహితమైనది కనుక దీనిలో యే దోషము వుండదు. పరిపూర్ణమైన ప్రేమ కనుక యే విధమైన మార్పు వుండదు. కనుకనే భగవంతునికి అనేక రకములైన బిరుదులు వుంటున్నాయి. నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం. భగవంతుడు అన్నిరకముల పవిత్రము పైన దానిలో వుండినవాడే యిది అపవిత్రము యిది పవిత్రము అని నిర్ణయము చేసేది. నీ దృష్టిలో వుంటున్నాది గాని భగవంతునిలో లేదు. యద్భావం తద్భవతి. నీవు యే రంగు అద్దములు వేసుకున్నావో ప్రపంచమంతా ఆదే రంగుగానే కనుపిస్తుంది. సృష్టి యొక్క దోషము కాదు నీ దృష్టి యొక్క దోషము.

ఇంద్రియములు యేదో దోషము గావిస్తున్నాయి అని మనము అనుకోటము మన భావముల యొక్క దోషమే. సరియైన భావములు అభివృద్ధి పరచుకుంటే యింద్రియములు సరైన అర్థము నిస్తాయి. తుకారాం చూడండి. తనలో మంచి భావము పెట్టుకొని భార్య చేసిన తప్పు పని కూడను మంచిదిగానే భావించాడు. కబీరు నిరంతరము భగవచ్చింతన చేత కాలము గడుపుతూ వచ్చాడు కనుకనే భార్య చేసింది మంచిగానే భావించాడు. Einstein సమ భావము కలిగి పవిత్రమైన హృదయము తో సాధనను సలుపుతూ వచ్చాడు కనుక యితను కూడను తన భార్య చేసిన పనిని సమన్వయము చేసుకుంటూ వచ్చాడు. కనుక మనలో మనము సమన్వయము గావించుకొనే సాధనలు సలపాలి. ఐతే భగవంతుడు మన యింద్రియములనంతా బయటకే యిచ్చాడు కనుక అతనిదే తప్పు గాని మాది కాదు అంటుంటారు కొంతమంది మొండి వారు. భగవంతుడు కన్నులనిచ్చాడు కాని బయటకే దాని తలుపులు పెట్టాడు లోపలకు పెట్టలేదే. భగవంతుడు చెవులిచ్చాడు ప్రపంచము పైపున పెట్టాడు గాని లోపలపైపు పెట్టలేదే. ముక్కు యిచ్చాడు బయట శ్వాసమునే తీసుకోమన్నాడు గాని లోపల శ్వాసము కాదన్నాడే. కాబట్టి సృష్టిలోనే దోషము వుంది. ఇది మా దోషము కాదని ఆ రకముగా సమన్వయము చేసుకుంటారు.

అదే తప్పు. అనేక దోషములు చేయటము ఎంత పొరపాటు. ఎంత పాపము. I am a human కాబట్టి తప్పులు చేయటము నా స్వభావము. అని సమర్థించుకుంటున్నాడు. చాలా తప్పు అదే పిల్లల లోపల. నీవు మానవుడైనందుకు తప్పులు చేయకూడదు. పశువైతే తప్పులు చేసినా పరవాలేదు. అది పశువు కనుక తనయొక్క ప్రవర్తన తాను చేస్తుంది. నీవు మనిషివై పోయి తప్పులు చేయకూడదు. అలాంటి తప్పులు చేసి మానవుడు ఇది సహజమే యని అనుకోటము ఇది సమర్థించుకోటం. పశువుగా పుట్టి పశువుగా ప్రవర్తిస్తున్నాది అది. మనము మనిషిగా పుట్టి పశువుగా ప్రవర్తించటము ఎంత విరుద్ధము. కనుక నీవు మనిషిగా ప్రవర్తించు. ఇంకా కొంత మంది గొప్ప తెలివి తేటలు కలిగిన విద్యార్థులు అనేక రకములుగా సమర్థించుకుంటూ వుంటారు. పక్షులు స్వేచ్ఛా విహారము చేస్తున్నాయి. ఎక్కడికంటె అక్కడకు పోతున్నాయి. ఏ విధమైన పక్షితోనైనా స్నేహము చేస్తున్నాది. కాబట్టి దానికి పూర్తి స్వేచ్ఛ వుంటుందాది. పశువులు, పక్షులు తమ తమ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. పశువులు, పక్షులు స్వేచ్ఛను అనుభవిస్తుంటె మానవుడు స్వేచ్ఛను అనుభవించనక్కర లేదా. నిజమే నీవు కూడను స్వేచ్ఛను అనుభవించు. ఐతే పశువులు యే స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి? పశు స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. మృగములు యు స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. మృగస్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. నీవు మనిషి మనిషి స్వేచ్ఛను అనుభవించు. నీవు మనిషివై మృగస్వేచ్ఛను అనుభవిస్తే దోషము కాదా? కనుక ఈ freedom freedom అనే దానిని మనము పెడర్థములతో నానార్థములతో దీనిని అభివృద్ధి పరచుకొని యదార్థమును మరచిపోతున్నాము. కనుక ఇది కాదు నిజమైన freedom. freedom అంటె యేమిటి స్వేచ్ఛగా విహరించటమేనా freedom.. ఇంద్రియములను విచ్చలవిడిగా వదలిపెట్టటమా freedom. కాదు. కాదు. ఆత్మజ్ఞానము. ఆత్మానందము. ఆత్మనిగ్రహము ఇది freedom.

పొద్దున్న చిబ్బర్ రెండు maps వేసి ఒకవైపున knowledge మరొకవైపున character అని పెట్టారు. కనుక మన balance యేమిటంటె ఒకవైపున knowledge ఒకవైపున character ఈ రెండూ సమన్వయముగా వుండినప్పుడే సక్రమమైన balance వుంటుంది.

నేటి విద్యలు తెలివి తేటలనె పెంచు
కొంచమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
ఫలమదేమి వాని విలువ ఏమి?

ఎంత తెలివి తేటలు వుండి యేమి ప్రయోజనము. దానిని వుంచే గుణము కూడను మరొకవైపున వుండాలి. అప్పుడే యిది సరియైన balance గా వుంటుంది. ఈనాడు మానవునకు యీనాటి విద్యావంతునకు balance పూర్తి తప్పిపోయింది. మనము బాక్సైకిలు balance తప్పిపోయిందంటే accident అయిపోతుంది. క్రిందపడిపోతాడు. మానవ జీవితము పవిత్రమైన జీవితము. దీనిలో balance లేకపోతే యెంత ప్రమాదము. కనుక యింద్రియములు ఒకవైపున గుణము మరొకవైపున యీ రెండింటిని అభివృద్ధి గావించుకోటమే విద్యావంతుని ప్రధాన కర్తవ్యము.

విద్యార్థులారా! మన యింద్రియములు సరియైన రీతిగా అదుపులో పెట్టుకోటమే కాదు. దీనిని సమన్వయ పరచుకోవాలి. పతంజలి చెప్పాడు యోగః చిత్తవృత్తి నిరోధకః యీ చిత్త వృత్తిని నిరోధించటము మహాకష్టము. అసాధ్యము. సమన్వయము గావించుకోటమే సరియైన సులభ మార్గము. మంచిని స్వీకరించు. చెడ్డ తనంత తానే దూరమైపోతుంది. కేవలము మానవుని బలహీనతలే దీనికి కారణమైపోతుంది. విదేశీయుడైన కార్లైల్ వుండేవాడు. అతను చాలా తెలివితేటలు గలవాడే. గొప్ప విద్వాంసుడే. కానీ యింద్రియ నిగ్రహము లేకపోవటం చేత మహా బలహీనుడైపోయాడు. ఒక imagination వుండి అతనిలో. రాత్రి పండుకొనే సమయములో నిద్ర పట్టేది కాదు. ఈ విధముగా ఒక నెలగడిచేటప్పటికి అతనికి అనారోగ్యము ప్రారంభమైంది. ప్రక్క యింటి వారిని పిలిచారు. 'సార్! నాకు అనారోగ్యము తెప్పించావు దీనికి నీవే కారణము. నీయింటిలో కోడి వుంటున్నాది. ఆ కోడి రాత్రంతా అరుస్తూ వున్నాది. ఆ అరుపువలన నాకు నిద్రరావటం లేదు. కనుక కోడిని నీవు తగిన భద్రత చేసుకో. నాకు ఆరోగ్య భిక్ష పెట్టమన్నాడు. ఆ పక్కింటి యజమానుడు చెప్పాడు. మేము అదే యింటిలో పడుకుంటున్నాము. నా కోడి రాత్రంతా కూసే స్వభావము కాదు. ఏ కోడైనా రాత్రంతా కూయదు. రాత్రి ఒక పర్యాయమో రెండు పర్యాయములో కూస్తుంది. అప్పుడు కార్లైల్ చెప్పాడు 'ఒక తూరో రెండు తూర్లో కూస్తుంది. అయితే నాకు పండుకొన్నప్పటినుంచి ఎప్పుడు కూస్తుందో అని ఆ చింతనే నాకు నిద్ర రాకుండా చేస్తుంది.' అన్నాడు ఇది కోడి కూత వలన వచ్చిన అనారోగ్యము కాదు. తనలో బలహీనత వల్ల వచ్చిన అనారోగ్యము. ఇట్లే ప్రతి వ్యక్తి యందు కూడను మన యింద్రియముల చేత ప్రమాదము కంటె భ్రమల చేత కలిగే ప్రమాదములు అధికముగా వుంటున్నాయి. కనుక మానవుని యందు యీ imagination పూర్తి పోవాలి. ఈ imagination మానవుని కృంగదీస్తుంది. యింక యింద్రియముల యొక్క ప్రభావము, యింద్రియములు యే విధమైన రీతిలో కొంతవరకు సమన్వయము చేసుకోవచ్చు అనేది మున్ముందు విచారిస్తాము.